క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత వైద్యశిబిరం

తిరుపతి కల్చరల్: ఆకృతి హాస్పిటల్ అధినేత డాక్టర్ అఖిల తండ్రి శ్రీనివాస్ గుప్త జయంతిని పురస్కరించుకుని లీలామహల్ సర్కిల్ సమీపంలోని చాపల మార్కెట్‌కు ఎదురుగా ఉన్న ఆకృతి హాస్పిటల్లో ఈనెల 18, 19, 20 తేదీల్లో మూడు రోజుల పాటు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ అఖిల తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రక్షాళన జరిగే వరకు పోరాటం



భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో రామచంద్ర యాదవ్, అతని అనుచరులు

భాకరాపేట: టీటీడీలో జరుగుతున్న అపచారాలు, అన్యాయాలను శ్రీవారికి విన్నవించేందుకు సోమవారం అలిపిరి నడక మార్గం నుంచి తిరుమల చేరుకున్న బీసీవై పార్టీ వ్యవస్థాపకులు రామచంద్ర యాదవ్‌ను తిరుమల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భాకరాపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి బైండోవర్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దారుణంగా తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చివేసిందని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు, టీటీడీ పాలక మండలికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో శ్రీవారికి విన్నవించేందుకు వెళ్తే పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌కు చేరిన వారిలో రామచంద్ర యాదవ్ అనుచరులు, శ్రీవారి భక్తులు ఉన్నారు.

హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: వినియోగదారుల హక్కులపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని ఎస్పీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ సూచించారు. పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, న్యాయవాది డాక్టర్ వీఎస్ రమేష్‌బాబు, విభాగాధిపతి డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ ఉమారాణి, డాక్టర్ భువనేశ్వరిదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం




విరాళం చెక్కును అందుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: విశ్రాంత డీఐఓ రవిరాజు రూ.లక్ష విరాళంగా అందించారు. సోమవారం ఆయన తమ తోటి ఉద్యోగులతో కలసి కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ వెంకటేశ్వర్లు, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు సమక్షంలో విరాళం చెక్కును అందజేశారు. ప్రభుత్వేతర సంస్థ అయిన అడాప్ట్ ఏ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ ద్వారా ప్రధానమంత్రి టీబీ ముక్త్‌భారత్ పథకం కోసం రూ.లక్ష వినియోగించాలని కోరారు. అందుకోసం ఈ డబ్బును ఖర్చు చేయమని ఆ చెక్కును కలెక్టర్ డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్‌కు ఇవ్వడం జరిగింది.

25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: ఈనెల 30వ తేదీన విశ్వావసు నామ సంవత్సర తెలుగు ఉగాదిని పురస్కరించుకుని, టీటీడీ శ్రీవారి ఆలయంలో మార్చి 25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనుంది. ఈ కారణంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. అదే విధంగా మార్చి 30 ఆదివారం నాడు శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని సహస్ర దీపాలంకరణ సేవ మినహా అన్ని ఆర్జిత సేవలను అధికారులు రద్దు చేశారు. మార్చి 25, 30 తేదీల్లో ప్రోటోకాల్ పరిధిలోని వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయి. ఈ కారణంగా మార్చి 24న, అదే విధంగా మార్చి 29న వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఎటువంటి సిఫార్సు లేఖలు తీసుకోమని తెలిపారు.

విద్యుత్ సమస్యలపై ఆరా



మిట్టకండ్రిగ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఈ

రామచంద్రాపురం (తిరుపతి రూరల్): విద్యుత్ సమస్యల పరిష్కారానికి ట్రాన్స్ అధికారులు గ్రామాల్లో పర్యటించారు. ఆపై ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఎస్ఈ సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో రామచంద్రాపురం మండలం, మిట్టకండ్రిగ గ్రామాన్ని సందర్శించారు. వ్యవసాయ, గృహ విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ పొలాల వద్ద సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ఆసక్తి చూపాలన్నారు. అనంతరం పలువురు రైతులు వ్యవసాయ విద్యుత్ సక్రమంగా అందడం లేదని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరును సులభతరం చేయాలని విన్నవించారు.

స్వచ్ఛ తిరుపతి..
లక్ష్యం అధోగతి



డ్రైనేజీ కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్

స్వచ్ఛ తిరుపతి కోసం ఉన్నతాధికారులు పరుగులు పెడుతున్నారు. గత ర్యాంకులను పటిష్టం చేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. కమిషనర్ మౌర్య ప్రతిరోజు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పారిశుధ్యాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో పారిశుధ్య కార్మికులపై పని భారం పడుతోంది. అయితే ఇదే సమయంలో శానిటరీ అధికారుల కక్కుర్తి కారణంగా లక్ష్యం పక్కదారి పడుతోంది. ఉన్న సిబ్బంది కాస్త పని ఒత్తిడి కారణంగా అనారోగ్యం పాలవుతున్నారు. మరోవైపు ప్రజారోగ్య అధికారులే ప్లాస్టిక్‌ను పెంచి పోషిస్తున్నారు. దానికితోడు ప్రస్తుత ప్రభుత్వంలోని పాలకులు కూడా తిరుపతి కార్పొరేషన్‌పై దృష్టి సారించకపోవడంతో స్వచ్ఛ తిరుపతి లక్ష్యం నీరుగారుతోంది.

- తిరుపతి కార్పొరేషన్‌లో వేధిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది కొరత
- అధిక పనిభారంతో అనారోగ్యం పాలవుతున్న కొందరు సిబ్బంది
- ప్లాస్టిక్‌ను పెంచి పోషిస్తున్న ప్రజారోగ్య అధికారులు
- నీరుగారుతున్న స్వచ్ఛ తిరుపతి లక్ష్యం

తిరుపతి తుడా: స్వచ్ఛ తిరుపతి సాధనకు పారిశుద్ధ్యం సవాల్ విసురుతోంది. తగినంత సిబ్బంది లేకపోవడంతో నగరంలో చెత్త, పారిశుద్ధ్యం పేరుకుపోతున్నాయి. సిబ్బందిని నియమించాలంటే ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్ణయం తీసుకునే అధికారం మున్సిపల్ కార్పొరేషన్‌కు లేదు. అయితే నాటి డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి సరికొత్త ఆలోచన చేశారు. తిరుపతికి యాత్రికుల తాకిడి అధికంగా ఉన్నందువల్ల పారిశుద్ధ్య నిర్వహణలో టీటీడీని భాగస్వామ్యం చేసేలా ఆలోచించారు. ఆ మేరకు సుమారు 1500 మందికి పైగా అదనపు పారిశుద్ధ్య సిబ్బంది అవసరమని గుర్తించి కౌన్సిల్లో ఒప్పించి టీటీడీకి సిఫార్సు చేశారు. తొలి విడతలో 1000 మంది సిబ్బందిని అప్పగించేందుకు టీటీడీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. టీటీడీ అధికారులతో చర్చలు జరిపి ఆ ప్రతిపాదనలను అమలు చేయించే సత్తా నేటి పాలకుల్లో కనిపించడం లేదు. దీంతో మెరుగైన పారిశుద్ధ్యం అమలు సవాల్‌గా మారుతోంది. ఉన్న సిబ్బందితో సత్ఫలితాలను సాధించడం అధికారులకు తలనొప్పిగా మారుతోంది.

భూగర్భ డ్రైనేజీ లీకేజీపై దృష్టి పెట్టండి

నగరంలో ఎక్కడా భూగర్భ డ్రైనేజీ కాలువల లీకేజీలు రాకుండా తగు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. గత కొన్నిరోజులుగా ఆమె కార్పొరేషన్ అధికారులను వెంట బెట్టుకుని నగరంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. తాజాగా సోమవారం కూడా 35వ వార్డులో హెల్త్, ఇంజినీరింగ్, ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించి, సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో భూగర్భ డ్రైనేజీ కాలువల లీకేజీలపై ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. వీటిని అరికట్టేందుకు తగు ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా శుభ్రం చేయాలని, కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రధానంగా ఆస్తిపన్నులు, నీటి పన్నులు తదితర పన్నులను అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి సకాలంలో వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ పాల్గొన్నారు.

వివరాలు..	
తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం పారిశుద్ధ్య సిబ్బంది	967
ఇందులో పర్మినెంట్ సిబ్బంది	110
అవుట్ సోర్సింగ్ సిబ్బంది	857
ప్రతి వార్డుకు అవసరమైన సిబ్బంది	14-18
తక్కువమంది పనిచేస్తున్న వార్డు	41 వార్డులో 9 మంది
అధిక మంది పనిచేస్తున్న వార్డు	ఒకటో వార్డులో 26 మంది

ప్రజారోగ్య సిబ్బంది కక్కుర్తి..

ఇటీవల కాలం వరకు నిషేధిత ప్లాస్టిక్‌పై కఠినమైన ఆంక్షలు ఉండేవి. ప్రజల్లో అవగాహన పెరగడంతో వినియోగం తగ్గుముఖం పట్టింది. అయితే కార్పొరేషన్‌లోని కొంతమంది ప్రజా ఆరోగ్య సిబ్బంది ప్లాస్టిక్ విక్రయాలను పెంచి పోషిస్తున్నారు. దీంతో నగరంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం మళ్లీ పుట్టుకొచ్చింది. బండ్ల వీధి, ఇసుక వీధి, కూరగాయల మార్కెట్, తిలక్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నిషేధిత ప్లాస్టిక్‌ను కఠినంగా అమలు చేయాల్సిన వ్యక్తులే మామూళ్లకు అలవాటు పడి విక్రయదారులకు సహకరిస్తున్నారు. కమిషనర్, హెల్త్ ఆఫీసర్లు ఎప్పుడైనా ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు చేసేందుకు రంగంలోకి దిగాలని భావిస్తే ఇదే విషయాన్ని వెంటనే విక్రయదారులకు చెప్పి అప్రమత్తం చేస్తున్నారు. దీంతో అధికారులు దుకాణాల వద్దకు వెళ్లేసరికి ప్లాస్టిక్ కవర్లు లేకుండా మాయం చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

నగరంలో నేడు

- టీటీడీ పరిపాలన భవనం ఆవరణలోని క్రీడా మైదానంలో ఉదయం 9 గంటల నుంచి క్రీడా పోటీలు
- ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో ఉదయం 10 గంటలకు దీక్షిణ భారత వేద సమ్మేళనం
- ఎస్వీ వేద విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ఉదయం 10 గంటలకు ఆగమ సిద్ధాంతంపై అంతర్జాతీయ కార్యశాల
- మెగా కార్పొరేట్ టీ-20 క్రికెట్ లీగ్ సెవెన్త్ ఎడిషన్-2025లో భాగంగా ఎస్వీ యూనివర్సిటీ మైదానంలో ఉదయం 8 గంటల నుంచి ఏ-1, బీ-2 విజేతల జట్లకు, మధ్యాహ్నం 1.30 నుంచి ఏ-2, బీ-1 జట్లకు సెమీఫైనల్ క్రికెట్ లీగ్ పోటీలు
- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బీపీఎస్, ఎల్ఆర్ఎస్ మేళా నిర్వహణ
- లీలామహల్ సర్కిల్ సమీపంలోని చేపల మార్కెట్‌కు ఎదురుగా ఉన్న ఆకృతి హాస్పిటల్లో ఉదయం 10 నుంచి 2.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఉచిత గైనిక్ లాప్రోస్కోపీ క్యాంప్
- శ్రీత్యాగరాజస్వామి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 నుంచి రాత్రి 9.15 గంటల వరకు త్యాగరాజ మండపంలో అన్నమయ్య సంకీర్తనోత్సవాలు ప్రారంభం.
- శ్రీపద్మావతి ప్రార్థన మహిళా మండలి ఆధ్వర్యంలో సాయంత్రం 5.30 గంటలకు మంచినీళ్లగుంట శివాలయానికి ఎదురుగా ఉన్న శ్రీపద్మావతి ప్రార్థన మహిళా మండలి హాల్లో ఆదర్శ మహిళా పురస్కారాలు ప్రదానం

బాల్యం నుంచే భారతీయ సంస్కృతి నేర్పాలి



వార్షికోత్సవంలో అతిథులు, అధ్యాపకులు, బాలలు

తిరుపతి సిటీ: విద్యార్థులకు బాల్య దశ నుంచే భారతీయ సంస్కృతిని, సంస్కృత భాషను నేర్పించాల్సిన అవసరం ఉందని, దీనికి ఎన్ఎస్‌యూ భాగస్వామి కావడం హర్షణీయమని అఖిల భారతీయ సంస్కృత భారతి ముఖ్యకార్యదర్శి సత్యనారాయణ భట్ అన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలోని బాల కేంద్ర వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. బాలకేంద్రం ద్వారా బాల్యం నుంచే పిల్లలకు సంస్కృతంలో స్తోత్రాలు, శ్లోకాలు, నీతి కథలు, సంస్కృత సంభాషణలు నేర్పించే బృహత్తర కార్యక్రమానికి జాతీయ సంస్కృత వర్సిటీ పూనుకోవడం అభినందనీయమన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, నగరంలో వివిధ పాఠశాలల్లో మొత్తం 70 బాలకేంద్రాలను ఏర్పాటు చేసి 20మంది అధ్యాపకులతో సంస్కృత భాషను నేర్పిస్తున్నామన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్య 4000 వేలకు చేర్చాలనే లక్ష్యంతో వెళ్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బాల వికాస కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎల్.సీతారామశర్మ, అధ్యాపకులు, బాలలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

ప్రోటోటైప్ అభివృద్ధితో సరికొత్త ఆవిష్కరణలు



వర్క్‌షాపులో అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రోటోటైప్, ప్రాసెస్ డిజైన్ డెవలప్‌మెంట్' అనే అంశంపై సోమవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రధాన వక్తగా శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగభూషణ్ రాజు మాట్లాడారు. ప్రోటోటైప్ అభివృద్ధి అనేది కొత్త ఆవిష్కరణలు, ఉత్పత్తుల రూపకల్పన, పరిశ్రమల అభివృద్ధి కోసం అత్యవసరమైన అంశమని, ఇది కొత్త ఆలోచనలను యథార్థ రూపంలో అనుసంధానించేందుకు సహాయపడుతుందని విద్యార్థులకు, పరిశోధకులకు అవగాహన కల్పించారు. వర్క్‌షాపులో రిజిస్ట్రార్ రజిని, ప్రొఫెసర్లు టి.శోభారాణి, వి.సరిత, ఉమ, విద్యార్థులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు పాల్గొన్నారు

నరసింహయ్యకు అవార్డు



నరసింహయ్యను అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: శ్రీపతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నరసింహయ్య సేవలను గురించి ఆయనను పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ అవార్డును ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ ఆయనకు అవార్డుతో సత్కరించి అభినందించి సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి సమాజ హితంకు దోహదపడాలని కోరారు.

అవగాహనతోనే క్యాన్సర్ నియంత్రణ



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: క్యాన్సర్ వ్యాధిని అవగాహన, అప్రమత్తతతోనే నియంత్రించవచ్చని చిలీకి చెందిన అటకమా వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ హరిబాబు తెలిపారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో క్యాన్సర్‌పై అవగాహన కలిగి మన చుట్టుపక్కల వారిని చైతన్యవంతులను చేయాలని సూచించారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా అరికట్టవచ్చన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

చంద్రగిరి: విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లోని రాగి వైర్లు చోరీకి గురైన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల మేరకు.. మండల పరిధిలోని దోర్నకంబాల పంచాయతీ, మల్లయ్యపల్లికి చెందిన దివాకర్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగానే సోమవారం రైతు తన పొలం వద్దకు వెళ్లాడు. అయితే పొలంలో ఏర్పాటు చేసిన మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడి ఉండడాన్ని చూసి పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించాడు. అనంతరం బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23న ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి కల్చరల్: భాష, సాహిత్య సేవాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన బైరాగిపట్టెడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో సాయంత్రం 5 గంటలకు ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కవులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ కవితలను వినిపించవచ్చన్నారు. కవితలు వివాద రహితంగా, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉండకూడదని తెలిపారు.

భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తిరుచానూరు సమీపంలోని శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయం వద్ద టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.మునిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయం ఏర్పాటు చేసి 41 రోజులు కావడంతో దత్తాత్రేయ స్వామి మండలాభిషేకం, ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. స్వామి మండలాభిషేకాన్ని పురస్కరించుకుని కృష్ణ, ఇంద్ర, బాలాజీ ఆటో మొబైల్స్, డ్రైవింగ్ భారతి వారి సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

ఎందుకు రుణాలు మంజూరు చేయట్లేదు ?

తిరుపతి సిటీ: కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఎంపికైన వారికి త్వరగా రుణాలు మంజూరు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య బ్యాంకర్లను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో బ్యాంకర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించినా ఎందుకు మంజూరు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రధానంగా కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి వద్ద రుణాలు మంజూరు కావాల్సి ఉందన్నారు. అన్ని దరఖాస్తులు పరిశీలించి త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎల్‌డీఎం విశ్వనాథ్ రెడ్డి, సీఎంఎం కృష్ణవేణి, సోము, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

కెమెరాల ఏర్పాటుపై చర్చ



జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో చర్చిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో కెమెరాల ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం కావడంతో సోమవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజును కలిశారు. ఈ మేరకు తిరుపతిలో సైబర్ క్రైమ్ నేరాలు అరికట్టడానికి కెమెరాలను అమర్చడానికి సహకరించాలని ఎస్పీ వారిని కోరారు. ఈ మేరకు స్పందించిన చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఫ్రీడం ఆయిల్ కంపెనీ వారితో చర్చించి రూ.40 లక్షల విలువ చేసే సీసీ కెమెరాలను తిరుపతి పోలీస్ శాఖ వారికి అందించేందుకు ఫ్రీడం ఆయిల్ యాజమాన్యం అంగీకరించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం కానున్నాయి. ఈ నేపథ్యంలోనే చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు జిల్లా ఎస్పీని కలిసి చర్చించారు.

నేడు విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ ప్రారంభం

చంద్రగిరి: మండల పరిధిలోని శ్రీసాయినాథ నగర్‌లో ఉన్న మోహన్‌బాబు యూనివర్సిటీలో బుధవారం విష్ణు మంచు ఆర్ట్ ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంబీయూ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించే ఈ కార్యక్రమానికి దేశవిదేశాల నుంచి ప్రముఖ చిత్రకారులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబు, ప్రోఛాన్సలర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి వినతిని పరిష్కరించండి



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 52 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా ఆరుగురు తమ సమస్యలు తెలుపగా, 46 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు పలు సమస్యలపై ఫిర్యాదు చేశారని ప్రతి వినతిని ఆయా విభాగాల అధికారులుకు పంపి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై వినతి

పాకాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, తమ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని స్థానిక తహసీల్దార్ సంతోస్‌సాయికి సోమవారం పలువురు విశ్రాంత ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు.

చిరుత.. చిక్కదు.. దొరకదు



వేదిక్ వర్సిటీ సమీపంలో ఏర్పాటు చేసిన బోను

వర్సిటీలలో ఓ చిరుత గత ఐదు నెలలుగా విద్యార్థులను, ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అటవీ అధికారులు ఎన్నిఎత్తులు వేసినా వేదిక్, వెటర్నరీ, ఎస్వీయూ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ శునకాలను వేటాడుతూ తప్పించుకుంటోంది. విద్యార్థులను అప్రమత్తం చేసేందుకు వర్సిటీలలో అటవీ శాఖాధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే వేదిక్ వర్సిటీ నీటిగుంట వద్ద ఒక బోను, హాస్టల్ వెనుక భాగాన అటవీ ప్రాంతంలో మరో బోను, టూరిజం కార్యాలయం వద్ద ఇంకొక బోను ఏర్పాటు చేశారు. కానీ బోన్ల సమీపంలో సంచరిస్తున్నా అందులో చిక్కకుండా చాకచక్యంగా తప్పించుకుంటుండడంతో అధికారులు సైతం అవాక్కవుతున్నారు. – తిరుపతి సిటీ

బాధలు చెప్పుకోవడానికి వస్తే..



ర్యాంప్ లేకపోవడంతో వీల్‌చైర్‌ను ఎత్తి అవతలి వైపు పెడుతున్న దృశ్యాలు

బాధలు చెప్పుకోవడానికి కలెక్టరేట్‌కు వచ్చే దివ్యాంగులకు ద్వారం వద్దే లోపలకు వెళ్లేందుకు పడుతున్న బాధ అంతా ఇంతా కాదు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ డేకు సాధారణ ప్రజలతో పాటు దివ్యాంగులు కూడా తమ బాధలు చెప్పుకోవడానికి వస్తారు. అయితే వారి కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్లను ఏర్పాటు చేశారు. కానీ ఆ వీల్‌చైర్‌లో అధికారులను కలిసేందుకు వెళ్లేటప్పుడు ద్వారం వద్ద ర్యాంప్ లేదు. దీంతో వీల్‌చైర్‌ను లోపలకు తోసుకుని పోవడానికి దివ్యాంగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తోడుగా వచ్చిన వారు వీల్‌చైర్‌ను కష్టమ్మీద ఎత్తి అవతలి వైపు పెడుతున్నారు. అధికారులు వీల్‌చైర్లను తోసుకుని వెళ్లేందుకు ర్యాంప్‌లను ఏర్పాటు చేయాలనిదివ్యాంగులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ప్రత్యేక పాఠ్యాంశంగా జీవ వైవిధ్యం



సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న బయో డైవర్సిటీ చైర్మన్, వీసీ

తిరుపతి సిటీ: విద్యార్థి దశ నుంచే జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, దీని కోసం ప్రత్యేక పాఠ్యాంశంగా చేర్చేందుకు కృషి చేస్తున్నట్టు బయోడైవర్సిటీ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. శేషాచలం జీవ వైవిధ్యం అనే అంశంపై సోమవారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో వీసీ అప్పారావు నేతృత్వంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. అంతరించిపోతున్న జీవజాలానికి శేషాచలం కొండలు ఆవాసాలు మారాయని, నగరాలలో జీవ వైవిధ్య అడవులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. డీఎఫ్ఓ వివేక్ మాట్లాడుతూ, శేషాచలం జీవవైవిధ్యానికి ప్రతీక అని, దీని రక్షణ బాధ్యత అటవీ శాఖదే అన్నారు. అనంతరం సామాజికవేత్తలు పి. నవీన్ కుమార్ రెడ్డి, కేఎన్. బాలాజీ, శ్రీవత్స, రమణ మాట్లాడారు. నూతన నిర్మాణాల కోసం తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్ఎస్ఎస్ బ్యూరో డాక్టర్ పాకనాటి హరికృష్ణ, అక్షర ఫౌండేషన్ అధినేత హరిబాబు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో రిజిస్ట్రార్ భూపతి నాయుడు, డాక్టర్ పత్తిపాటి వివేక్, ప్రొఫెసర్ కామాక్షమ్మ, చంద్ర, శరత్‌బాబు, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రం వద్ద భూగర్భ డ్రైనేజీ నుంచి పొంగి పొర్లుతున్న మురుగునీరు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా కపిలతీర్థం రోడ్డు ద్వారకానగర్‌లోని గీతాంజలి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అయితే స్కూలుకు అతి సమీపంలోనే భూగర్భ డ్రైనేజీ నుంచి మురుగునీరు పొంగి పొర్లి పిల్ల కాలువలా ప్రవహించింది. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు, తల్లిదండ్రులు విధి లేక ఆ మురుగు నీటిలోనే నడుచుకుంటూ కేంద్రానికి చేరుకున్నారు. పరీక్ష కేంద్రంలోనికి అనుమతించే వరకూ ఆ ప్రాంతంలో విధిలేక దుర్గంధం భరిస్తూ నిరీక్షించాల్సి వచ్చింది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరుపతి : 99516 02971
చంద్రగిరి : 95055 17845